# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అనకాపల్లిలో ఏర్పాటయ్యే ఉక్కు కర్మాగారం అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
2. **ఖరీఫ్ పంటకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 29.39 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.**
3. **రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని డీజీపీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు.**
4. **వాట్సప్ ద్వారా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చెప్పారు.**

===========================

స్విజ్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశ్రామికవేత్త లక్ష్మీమిట్టల్‌తో ఈరోజు సమావేశమైయ్యారు. అనంతరం లక్ష్మీమిట్టల్ మాట్లాడుతూ, అనకాపల్లి సమీపంలో 2 దశల్లో 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్ట్‌ను 1.4 లక్షల కోట్ల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనకాపల్లిలో ఏర్పాటయ్యే ఉక్కు కర్మాగారం అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా తెలిపారు.

ఇది ఇలా ఉండగా ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు పెట్రోకెమికల్స్ అన్వేషణకు వ్యూహాత్మక ప్రాంతమని, అక్కడ పెట్రో కెమికల్ కేంద్రం ఏర్పాటుకు పెట్టుబడుల పెట్టాలని నారా లోకేశ్ ఆహ్వానించారు. స్థిరమైన మౌలిక సదుపాయాలు, బలమైన ప్రభుత్వ మద్దతు అనేవి పెట్రోకెమికల్ రంగంలో పెట్టుబడులకు అనుకూలతలుగా ఉంటాయని లోకేశ్ వివరించారు.

---------------------------

ఖరీఫ్ పంటకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 60లక్షల మంది రైతుల నుంచి 29.39లక్షల టన్నుల ధాన్యం సేకరించామని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఇప్పటివరకు 5 వేల 878.49 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలోకి జమ చేశామని వివరించారు. గత ప్రభుత్వ ధాన్యం బకాయిలను

ఒక వెయ్యి ,674 కోట్ల రూపాయలను కూడా చెల్లించామని తెలిపారు రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల నియంత్రణకు చర్యలు చేపతున్నామని పోలీస్ డైరక్టర్ జనరల్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. కాకినాడలో నిన్న పర్యటించిన ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, సమస్యాత్మక ప్రాంతాలలో కృత్రిమ మేధ, డ్రోన్ వ్యవస్థ ద్వారా నిఘాను మరింత పెంచామన్నారు. ప్రతీ జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలుపుతూ,

వాయిస్ ( 33 సెకన్లు)

---------------------------

వాట్సప్ ద్వారా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను రాష్ట్ర వ్యాప్తంగా జారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ పాలన విధానంలో వాట్సప్ అమలుపై సంబంధిత అధికారులతో నిన్న ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను పౌరులకు మరింత సులభంగా అందించేందుకు వాట్సప్ గవర్నెన్స్ తీసుకొస్తున్నట్లు తెలిపారు.గుంటూరు జిల్లా తెనాలిలో ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మక ప్రాతిపదికన చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ విధానం ద్వారా క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిశీలించి తదునుగుణంగా వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు విజయానంద్ సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ఏర్పాటు చేసే పరిశ్రమలలో బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులిచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ నిబంధనలు-2017ను ప్రభుత్వం సవరించింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ జారీ చేసింది. ఈ సవరణల ప్రకారం పారిశ్రామిక రంగంలోనూ బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులివ్వనున్నారు. తక్కువ స్థలంలో భారీ పరిశ్రమల ఏర్పాటు, కార్మికులకు శిక్షణ, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించే వీలుంటుందని పురపాలక అధికారులు తెలిపారు.

---------------------------

ప్రతి గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని నరసన్నపేట శాసనసభ్యులు బి. రమణమూర్తి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా, పోలాకి మండలం మబగాం గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పాడి పశువులకు వచ్చే వ్యాధులకు వైద్యం అందించేందుకు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని కోరుతూ..,

వాయిస్ ( 27 సెకన్లు)

---------------------------

ఉత్తరాఖండ్ లో జరగనున్న జాతీయ క్రీడా పోటీల్లో క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని రాష్ట్ర

క్రీడా ప్రాధికార సంస్థ –శాప్ అధ్యక్షులు ఏ . రవినాయుడు ఆకాంక్షించారు. విజయవాడ గుణదలలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా అన్ని జిల్లాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా వసతులను కల్పిస్తున్నామని చెప్పారు. కాగా 38వ జాతీయ క్రీడా పోటీలు ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ జరగనున్నాయి.

---------------------------

జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడులలో చిత్తూరుజిల్లా బంగారుపాళెం మండలం రాగిమానుపెంట గ్రామానికి చెందిన జవాన్ పి. కార్తీక్ వీరమరణం పొందారని అధికారులు తెలిపారు. ఆయన మృతి పట్ల చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక్ వీరమరణం పొందడం బాధాకరమని, కార్తీక్ త్యాగం మరువలేనిదని..ఆయన కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. కార్తీక్ పార్థివ దేహాన్ని ఈ సాయంత్రం స్వస్థలానికి తరలించి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

---------------------------

పల్నాడు జిల్లా ప్రజలకు మరిన్ని అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి తెస్తున్నామని నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు వెల్లడించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో 2 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న వైద్య పరీక్షల కేంద్రం, డయాలసిస్ యూనిట్ లకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబుతో కలిసి నిన్న ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అరవింద్ బాబు మాట్లాడారు. ప్రజారోగ్య ప్రయోగశాల ఏర్పాటు ద్వారా ఆరోగ్య పరీక్షలు త్వరితంగా చేయగలిగే అవకాశం ఉంటుందని ఆయన తెలియజేస్తూ...

వాయిస్ ... 30 సెకన్లు

---------------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమానికి చిత్తూరు జిల్లాకి చెందిన సర్దార్, సల్మా దంపతులకు ఆహ్వానం అందింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటిని నిర్మించుకున్న వారిని ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వీరిలో చిత్తూరులోని ప్రశాంత్ నగర్‌కు చెందిన సర్దార్, సల్మా దంపతులకు ఆహ్వాన పత్రికను తపాలా శాఖ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి ఆహ్వానం అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

=====================